ఓం నమోభగవతే శ్రీరమణాయ, శ్రీ భారతీ దేవ్యైనమః

ఉమాసహస్రము

(ఎనిమిదవ శతకము – ద్వితీయస్తబకము)

త్రింశ స్తబకము

అవ:- ఈ ముప్పదవ స్తబకమునందు, ధ్యానావాహనాసనాద్యుపచార రూపమగు అధ్యాత్మపూజ- కీర్తింపఁబడుచున్నది. అందు మొదట – హాసస్తుతి కావింపఁబడుచున్నది.

మూ॥ కృ తేన సానిసర్గతో, ధృతేన నిత్యమాననే
సి తేన శీత శైలజాస్మి తేన శంతనోతుమే॥ 1

స్వభావము వలన సిద్ధించినదియు, ముఖము నందు నిత్యమునుధరింపఁబడినదియు, తెల్లనిదియు, అగు మందహసితము చేత సర్వేశ్వరియగు ఆ పార్వతి నాకు సుఖమునొసఁగుఁగాత!

మూ॥ ప్రతి క్షణం వినశ్వరా, నయే! విసృజ్యగోచరాన్
సమర్పయేశ్వరీం మనో వివిచ్య విశ్వశాయినీమ్॥ 2

ఓ మనస్సా! ప్రతి క్షణమునందును వినశ్వరములును, ఇంద్రియార్థములును, అగు శబ్దాదివిషయములను పరిత్యజించి, మనస్సును వివేచించి (చిత్తవృత్తులను వేరుగాఁ జేసి) వృత్తులకును, విషయములకును, ఆధారముగానున్న విశ్వశాయినియగు నీశ్వరిని పూజింపుము.

ప్రభ:- దీని చేత పూజోపచారములందు ప్రథమమగు ధ్యానము చెప్పఁబడినది.

మూ॥ విశుద్ధదర్పణేనవా విధారితే హృదామ్బ! మే
అయి ప్రయచ్ఛ సన్నిధిం నిజేవపుష్యగాత్మజే! 3

అమ్మా! పార్వతీ! నిర్మలమగు దర్పణము చేతనువలె నాహృదయము చేత లెస్సగా ధరింపఁబడిన నీ శరీరము యొక్క సాన్నిధ్యము నిమ్ము.

ప్రభ:- విశుద్ధమగు నద్దమునందు వలె ప్రసన్నమగు నా హృదయమున స్థితి గల నీరూపమును ప్రదర్శింపుమని భావము. దీని చేత- ఆ వాహనము చెప్పఁబడినది.

మూ॥ పురస్యమధ్యమాశ్రితం సితం యదస్తి పఙ్కజమ్।
అజాణ్డమూల్యమస్తుతే సురార్చితే! తదాసనమ్॥ 4

దేవపూజితవగు జననీ! పురమధ్యము (శరీరమునకు ముఖ్యమును మూలమును అగు హృదయము) నాశ్రయించిన శ్వేత పుండరీకమున్నది. అది బ్రహ్మండముయొక్క వెలగలది. ఆ నా హృదయము- నీకాసనముగుఁగాత !

ప్రభ:- 'బ్రహ్మండ మూల్యమగు నా హృదయారవిందము నీకాసనముగుగాత!' అని భావము.

విశే:-హృదయారవిందము – బ్రహ్మండము యొక్క మూల్యము (వెలఁగలదను నంశమును క్రింది శ్రుతి చెప్పుచున్నది. ''యావాన్వా అయమాకాశః తావానేషోన్తర్హృదయ ఆకాశః. ఉభే అస్మిన్ ద్యావా పృథివీ అన్తరే సమాహితే, ఉభావగ్నిశ్చ వాయుశ్చ సూర్యాచన్ద్రమసావుభౌ, విద్యున్న క్షత్రాణి, యచ్చాన్యే హాస్తి, యచ్చనాస్తి సర్వం తదస్మిన్ సమాహితమ్'' అని.)

(ఛాందోగ్యోపనిషత్, అష్టమోధ్యాయః,3)

(''బ్రహ్మపురమగు శరీరమునందు – దహరమగు (అల్పమగు)

గృహమువంటి హృదయ పుండరీకమునందు – దహరమగు (అల్పతరమగు) ఆకాశమునందు (ఆకాశాఖ్యమగు బ్రహ్మమునందు) ఏమున్నది? అందన్వేషింపఁదగినది గాని, విశేషించి తెలియఁదగినది గాని, యేమున్నది?'' అని అడిగిన శిష్యులకు – ఆచార్యుఁడిట్లు చెప్పవలయును. ''పుండరీకమునందున్న యాకాశము పుండరీకము కంటె నల్పతరమను నభిప్రాయము చేత – పుండరీకమునందు దహరాకాశమున్నదని చెప్పుటలేదు. ''హృదయ పుండరీకమల్పము. దానియందున్న యంతఃకరణము – పుండరీకాకాశము చేత పరిచ్ఛిన్నము. ఆయంతఃకరణము – విశుద్ధమగునపుడు, ఇంద్రియాదుల నుపసంహరించిన యోగులకు స్వచ్ఛమగు జలమునందువలెను, శుద్ధమగు నద్ధమునందువలెను, ప్రతిబింబరూపమును, విజ్ఞానజ్యోతిః స్వరూపావభాసమును, అగు చుతావనాత్రమగు (అత్యల్పమగు) బ్రహ్మము– గ్రహింపఁబడును'' అనునభిప్రాయమున హృదయ పుండరీకమునందు అంతఃకరణోపాధి నిమిత్తమగు దహరమగు (అల్పతరమగు) ఆకాశమున్నదని చెప్పియున్నాము. కాని స్వయముగా పరిణామము వలన భౌతికమగు నీయాకాశము – ఎంతదియో, అంతర్గతమగు నీ హృదయాకాశము గూడ – అంతదియే. అని చెప్పఁబడినది. కాని యీ యంతరాకాశము – భౌతికా కాశతుల్యమగు పరిణామము మాత్రమే గలదికూడ కాదు. అనంతమగు ఈ బ్రహ్మకాశమునకును రూపమగు దృష్టాంతము లేకుండుట వలన భౌతికా కాశతుల్యత్వము చెప్పఁబడినది. ' ఆకాశము, దివము, భూలోకము, గూడ – ఈయంతరాకాశముచేతనే– అవరింపఁబడియెను'' అనియు, '' ఆ యీ యాత్మవలననే (బ్రహ్మకాశము వలననే) – ఆకాశము సంభవించెను'' అనియు, ఈ మొదలగు నర్థమును బోధించు శృతులవలన – బ్రహ్మ స్వరూపమనంతమని తెలియుచున్నది. ద్యావా పృథువులు రెండును గూడ – బుద్ధ్యుపాధివిశిష్టమగు బ్రహ్మకాశమునందే సమాహితములు (చక్కగా నుంచఁబడినవి) అగ్నియు వాయువు అను రెండును, సూర్యుఁడు చంద్రుఁడు అనునిద్దఱును, విద్యున్నక్షత్రములును, దేహవంతుఁడును నీయాత్మకు – ఆత్మీయమై యున్నవి. ఈ లోకము

నందున్నదియు, నష్టముకాఁగలదియు, నగు సర్వమును గూడ హృదయాకాశమగు బ్రహ్మమునందే ఉంచఁబడియున్నది. కావున తదాశ్రయమగు హృదయపుండరీకము – బ్రహ్మాండమూల్యమగుచున్నది. ఉమాసహస్రప్రథమ భాగమునందలి చతుర్థ స్తబకమునందున్న ''చిత్తమణీయోవిత్తం య ఇదం మూల్యే ప్రపఞ్చతో ఉ వ్యధికమ్! హృదయగుహాయాం నిహితమ్'' అను **22**వ శ్లోకమీయర్థమునే తెలుపుచున్నదని గ్రహించునది (ఈ యంశమును గురుముఖమున నెఱుఁగవలయు) 'పురస్య' అను నీ శ్లోకముచేత – ఆసనము చెప్పఁబడినది.

మూ॥ అఖణ్డధారయా ద్రవ న్న వేన్దు శేఖరప్రియే!
మదీయభక్తి జీవనం దధాతు తేఽమ్బ! పాద్యతామ్॥ 5

బాలచంద్రశేఖర ప్రేయసివగు జననీ! అవిచ్ఛిన్నమగు (ఎడతెగని) ధారచేత స్రవించుచున్న మదీయమగు భక్తియను జీవనము (ఉదకము) నీకు పాద్యమగుఁగాత!

ప్రభ:- నిరంతర ధారారూపమగు నా యీ భక్తి – నీ చరణములకు పాద్యముగాఁ జేయఁబడుఁగాత! పాద్యమను ఉపచారము చెప్పఁబడినది.

మూ॥ వివాసనౌఘ మానస ప్రసాదతోయ మమ్బ మే
సమస్తరాజ్ఞి! హస్తయోరనర్ఘ్యమర్ఘ్యమస్తుతే॥ 6

సర్వేశ్వరీ! వాసనా సమూహమును పోఁగొట్టుకొనిన మనస్సు యొక్క నైర్మల్యమేయగు తోయము– (నీరు) నీ హస్తములకు అమూల్యమగు అర్ఘ్యము (పూజాద్రవ్యము) అగుఁగాత! (నామనోనైర్మల్యమే– నీ పూజ) అని భావము.

ప్రభ:- అర్ఘ్యోపచారమునకు గాను మనఃప్రసాదము – తోయమువలె నాచరించుఁగాత!

మూ॥ మహేన్ద్రయోని చిన్తనాత్ భవన్ భవస్యవల్లభే!
మహారసోరస స్త్వయానిపీయతాం విశుద్ధయే॥ 7

భవప్రియా! మహేంద్రయోనిని ధ్యానించుట వలన స్రవించుచున్న మహారసమును – (శ్రేష్ఠమగు ఆస్వాదము గల అమృతరసమును) నా శరీరమునకు శుద్ధిని సంపాదించుటకై నీవు త్రాగుదువుగాక!

ప్రభ:- ''అన్తరేణతాలుకే య ఏషస్తన ఇవావలమ్బతే, సేన్ద్రయోనిన, యత్రాసౌకేశాన్తో నివర్తతే, వ్యపోహ్యశీర్షకపాలే'' హృదయమునకు (పుండరీకాకారమగు మాంస పిండమునకు) మీదుగా ప్రవర్తించుచున్న సుషుమ్నానాడి - యోగ శాస్త్రముల యందు ప్రసిద్ధమైయున్నది. ఆనాడి – తాలుకలకు మధ్య భాగమునందున్నది. ఆ తాలుకల మధ్య భాగమునందే పుండరీకాకారమగు మాంస పిండము స్తనమువలె వ్రేలాడుచుండును. సుషుమ్నానాడి – దానిమధ్యము నుండి మీఁదికి పోవుచు, కేశముల మొదళ్ళుగల ప్రదేశమున శిరఃకపాలములను భేదించి బయలువెడలి, బ్రహ్మస్వరూపము నొందుటకు మార్గమై యుండుటవలన - 'ఇంద్రయోని' (పరమాత్మను బొందుటకు కారణము) అని చెప్పఁబడుచున్నది. 'సయఏషోఽన్తర్హృదయ ఆకాశః, తస్మిన్నయం పురుషోమనోమయః. అమృతో హిరణ్మయః'' పుండరీకా కారమగు మాంసపిండము- హృదయమని చెప్పఁబడుచున్నది. దానియందే ప్రాణములున్నవి. అది ఊర్ధ్వనాలమును, అనేక నాడీ సుషిరమును అధో బిలమును గల మాంసపిండము. ఆ హృదయమునందున్న యాకాశమున (అవకాశమున) ఆ యీ పురుషుఁడున్నాఁడు. పురమునందు శయనించుట వలన గాని, పూర్ణుడగుటవలన గాని, పురుషుఁడని చెప్పఁబడునతఁడు మనోమయుఁడు. (అంతఃకరణము నభిమానించువాఁడు. లేక, అంతఃకరణ మయుఁడు, లేక అంతఃకరణలింగుఁడు) అమరణధర్ముడు. జ్యోతిర్మయుఁడు, ఇట్టి లక్షణములు గలిగి హృదయాకాశమునందు సాక్షాత్కరింపఁబడిన పరమేశ్వరుని (అపరబ్రహ్మమును) చేరుటకు విద్వాంసుఁడగుయోగికి ఇంద్రయోనియగు

సుషుమ్నా నాడీరంధ్రమే – మార్గమగుచుండునని తైత్తిరీయోపనిషత్తు చెప్పుచున్నది. లేక ప్రస్తుత విషయమేమనిన;- ఇంద్రయోనియగు సుషుమ్నా మార్గమును ధ్యానించుట వలనఁ గలుగు నమృతరసమును నీవే యాస్వాదింపుము. తదాస్వాదము వలన శుద్ధమగు శరీరము – నీకు నివాసస్థలమగుఁగాక అని భావము. ఈ శ్లోకము చేత పానీయమను నుపచారము కావింపఁబడినది. (ఈ యంశముగూడ- బ్రహ్మవిదులగు యోగుల సన్నిధి నభ్యసింపఁదగును.)

మూ॥ సహస్రపత్రపఙ్కజద్రవత్ సుధాజలేన సా
సహస్రపత్రలోచనా పినాకినోఽభిషిచ్యతే॥ 8

సహస్రార (సహస్రదళ) కమలమునుండి స్రవించుచున్న అమృతరసము చేత - శివుని సహస్రపత్రలోచన (శివుని యొక్క కమలాక్షి) యగు ఆ భగవతి – అభిషేకింపఁబడుఁగాత!

ప్రభ:- సహస్రారమునందలి యమృతరసము చేత – దేవిని స్నానము చేయింతునని భావము. నైష్ఠిక శిరోమణియగు గణపతికవి యొక్క శరీరము లోపల ప్రసన్నయగు దేవి – యోగశక్తి చేత –ఆవిష్కృతమగు సహస్రారామృతము చేత నభిషేకింపఁబడినదను నంశము దీని చేత స్పష్టపడుచున్నది. ఈ శ్లోకముచేత – స్నానము ఉపచారము చెప్పఁబడినది.

మూ॥ మమార్జితం యదిన్ద్రియైః, సుఖంసుగాత్రి! పఞ్చభిః
తదమ్బ! తుభ్యమర్పితం సుధాఖ్యపఞ్చకాయతామ్॥ 9

సుగాత్రీ! జననీ! కన్ను మొదలగు నింద్రియముల చేత చూచుట మొదలగు ఏ సుఖమును నేను సంపాదించుచున్నానో, ఆ సుఖము – నీకు పంచామృతము లగుఁగాత!

ప్రభ:- సంప్రదాయము ననుసరించి బాహ్యపూజోపచారములయందును సుప్రసిద్ధమగు పంచామృతస్నానమిందు జెప్పఁబడినది.

మూ॥ వసిష్ఠగోత్ర జన్మనా ద్విజేన నిర్మితం శివే!
ఇదం శరీరమేవమే తవాస్తు దివ్యమంశుకమ్॥ 10

శివా! భగవతీ! వసిష్ఠ గోత్రమున జనించిన ద్విజుఁడగు కౌండిన్యుఁడను బ్రాహ్మణుని చేత నిర్మింపబడిన (ఉత్పాదింపఁబడిన) యీ నా శరీరము నీకు దివ్యమగు దుకూల మగుఁగాత!

ప్రభః:- ప్రశ్న:- స్వీయమగు శరీరము తన చేతనే నిర్మింపఁబడినదని చెప్పబడినది. ఇది యెట్లు కుదురును?

ఉత్తరము:- నైష్ఠికుఁడగు నీయాచార్యుఁడు- దేవీవసనయోగ్యమగు, లోపలి దేహమును తపోబలముచేత నిర్మించి - తత్పరిపాక మహిమ చేత - భౌతికమగు (భౌమమగు) దేహముగూడ - దేవికి దివ్యదుకూలమగుఁగాత! అని చెప్పుచున్నాఁడు. దీని చేత వసనమును (వస్త్రముఅను) ఉపచారము. చెప్పబడినది.

మూ॥ విచిత్రసూక్ష్మతన్తుభృ న్మమేయమాత్మనాడికా।
సుఖప్రబోధవిగ్రహే! మఖోపవీతమస్తుతే॥ 11

చిదానంద శరీరవగు (జ్ఞానానంద విగ్రహవగు) జననీ! అద్భుతమును, సూక్ష్మదృగ్గోచరమును, అగు తంతువును (సూత్రమును) భరించునదియగు నాయీ ఆత్మనాడిక (సుషుమ్నానాడి) నీకు యజ్ఞోప వీతమగుఁగాత!

ప్రభః:- అంతఃస్పర్శ గమ్యమును, విచిత్రమును, అగుచు- హృదయము నుండి ఆత్మ జ్యోతిస్సును వహించుచు, సహస్రారమునకు, బోవునదియు, మధ్యనాడి, బ్రహ్మనాడి, అమృతనాడి, అని యాత్మవేత్తల చేత గానము చేయఁబడునదియు, నగు - సుషుమ్నానాడి- నీకు జన్నిదమగుఁగాత! అని భావము. వస్త్ర సమర్పణము తరువాత - ఉపవీతధారణము చెప్పఁబడినది.

మూ॥ మహద్ విచిన్వతో మమస్వకీయ తత్త్వవిత్తిజమ్
ఇదంతు చిత్త సౌరభం శివేతవాస్తుచన్దనమ్॥ 12

శివా! సర్వోత్కృష్టమగు తత్త్వమును (లేకవస్తువును) వెదకుచున్న నాయొక్క స్వకీయమైన (ఆత్మీయమైన) యాదార్థ్యము (తత్త్వము) యొక్క జ్ఞానము చేత జనించిన ఈ చిత్త సౌరభమే నీకు చందనము (గంధము) అగుఁగాత!

ప్రభః:- తత్త్వ విచారము వలన సువాసితమగు మనసు- నీకు గంధముగాఁ జేయఁబడుఁగాత! అని భావము, దీని చేత - గంధధారణము - కీర్తింపఁబడినది.

మూ॥ మహేశనారి! నిశ్వసం స్తథాఽయముచ్ఛ్వసంస్తదా
తవానిశంసమర్చకో మమాస్తు జీవమారుతః॥ 13

మహేశ్వరనారీ! ఎల్లప్పుడును గూడ నిశ్వసించుచు, (వెలుపలికి పోవుచు) ఉచ్ఛ్వసించుచు, (లోపలికివచ్చుచు) సంచరించుచున్న నాయీ ప్రాణవాయువు - నిన్ను నిరంతరముగా పూజించుఁగాత!

ప్రభః:-నా ప్రాణవాయువు - నీకు పూజా పుష్పమగుఁగాత! అని భావము, దీని చేత 'పుష్పార్చనము' అను నుపచారము చెప్పఁబడినది.

మూ॥ విపాక కాలపావక ప్రదీ ప్తపుణ్యా గుగ్గులుః
సువాసనాఖ్యధూపభృద్ భవత్వయం మమామ్బతే॥ 14

విపాక కాలమునందగు నగ్నిచేత ప్రదీప్తమగు, పుణ్యమగు సుగంధ ధూపద్రవ్యము - నీకు సువాసనాఖ్యమగు ధూపమగుఁగాత।

ప్రభః:- నాయొక్క పుణ్య పరిపాక వశము వలన గలిగిన సువాసనలే (శోభన సంస్కార విశేషములే) నీకు ధూపమగుఁగాత! అని భావము. ధూపము - సమర్పింపబడినది.

మూ॥ గుహావతార మౌనినా మయీశ్వరి! ప్రదీపితా!
ఇయం ప్రబోధ దీపికా ప్రమోద దాయికాఽస్తుతే. 15

ఈశ్వరీ! గుహావతారుడిడగు (స్కందాంశము వలన జన్మించిన) మౌనిచేత (రమణ మహర్షి చేత) ప్రజ్వలింపఁ జేయఁ బడిన - యీ ప్రబోధ (జ్ఞాన) దీపిక- నీకు, ప్రమోదదాయిక యగుదిగాత!

ప్రభ:- ఇందు దీపము - దర్శితము,

మూ॥ ఇమామయి! ప్రియాత్ ప్రియాం మహారసా మహబ్సృతిమ్।
నివేదయామిభుజ్క్ష తామియంత్వయానిరామయే. 19

నిరామయ (నీరోగ) వగు జననీ! ప్రియము కంటెను గూడ ప్రియమయి నదియు, గొప్ప రసము (రుచి) గలదియు, అగు ఈయహం కారమును (నీభోజనము కొఱకు) నివేదించుచున్నాను. దీనిని నీవు భుజింపుము.

ప్రభ:- ప్రాణులకు - అత్యంత ప్రియమగు వస్తువు - 'నేను' అనునది. (అహంకారము) దాని రుచి మిక్కిలి గొప్పది. అయినను దానిని నీకు సమర్పించు చున్నాను. నీవు దానిని భుజింపుమని భావము.

విశే:- ' అది - భక్షింపఁదగినది' అను నంశమును స్ఫురింపఁజేయుటకు గొప్ప రసము గలదని చెప్పఁబడినది. నీవు రోగము లేనిదానవు. కావున, దోషభూయిష్ఠమయినను గూడ నహంకారమును భుజించుట వలన నీకు రోగము కలుగదని స్ఫురింపఁజేయుటకు 'నిరామయవగు జననీ!' అని సంబోధింపఁబడినది. మహా రసము గలదని చెప్పుటవలన - ఈయహంకారము - శుద్ధమని తోఁచుచున్నది. భక్షణీయవస్తువగు నహంకారము శుద్ధము కాని యెడల - భగవతికి నివేదింపఁగూడదు గదా! శుద్ధము కానిదైనను గూడ నహంకారమును గ్రహించుటకు సామర్థ్యము గల నిరామయయగు దేవికి శుద్ధమగు నహంకా[రము] గ్రహించుటకు సామర్థ్యము లేకుండునా? దీని చేత - అహం కారార్పణమను 'నైవేద్యము' చెప్పఁబడినది.

మూ॥ సరస్వతీ సుధాయతే మనోదధాతి పూగతామ్।
హృదేవపత్ర మమ్మికే! త్రయంసమేత్యతేఽర్ప్యతే. 17

అమ్మా! నా మాట సున్నముగాను, మనసు చెక్కగాను, హృదయము ఆకుగాను చేసి కూర్చి. నీకు తాంబూలము నిచ్చుచున్నాను.

ప్రభ:- ఇది - తాంబూలార్పణము.

మూ॥ వినీలతోయదా స్తరే విరాజమాన విగ్రహా।
నిజావిభూతిరస్తుతే తటిల్లతా ప్రకాశికా॥ 18

వినీలజలదాంతరము నందు విభ్రాజమానమగు శరరముగలదియు, నీ యొక్క స్వీయకలా విశేషమును, అగు తటిల్లత - అజ్ఞాచక్రమున స్ఫురించు (మెరుపుదీగ) నిన్ను ప్రకాశింపఁజేయుఁగాత.

ప్రభ:- నా శరీరము నందలి అజ్ఞాచక్రము (ఆరవచక్రము) మీఁద స్ఫురించుచున్న మెరుపుతీగ - నీకు నీరాజనమగుఁగాత! తంత్రశాస్త్రములందు - కొందఱు అనాహతచక్రమునకు దిగువనున్న చక్రములయందు, తటిత్ స్వరూపము కాన్పించునని చెప్పుదురు. కొందఱు - అజ్ఞా చక్రమునకు మీదుగనే యది కాన్పించునని చెప్పుదురు. దీనిచేత 'నీరాజనము' చెప్పఁబడినది.

మూ॥ స్వరోఽయమన్తరమ్బికే! ద్విరేఫవత్ స్వరంస్తదా
మమాభిమన్త్ర్యధీసుమందదాతి దేవి! తేఽఞ్జలిమ్. 19

అంబికా! (అమ్మా) లోపలనున్న యీ స్వరము (శుద్ధమగు ప్రాణము) భ్రమరము వలె, నెల్లప్పుడును అవ్యక్తనాదాయమానమై నాయొక్క బుద్ధి పుష్పమును అభిమంత్రించి (జపించి) నీచరణమున కర్పించుచున్నది.

ప్రభ:- ''స్వృశబ్దోపతాపయోః'' అనుట వలన – స్వృధాతువునుండి నిష్పన్నమగు స్వరశబ్దము నాదార్థకమని తెలియఁదగియున్నది. '' ఈ స్వరమే - ప్రాణమునకు మూలమును, ఉద్గీథాపరనామధేయమును అగు స్వరూపము'' అని యౌపనిషదులు చెప్పుదురు.

మూ॥ తవార్చనం నిరన్తరం యతోవిధాతు మస్మ్యహమ్।
నవిశ్వనాథపత్ని! తే విసర్జనం విధీయ తే॥ 20

విశ్వనాథ పత్నివగు జననీ! నిన్ను విసర్జించుట విధికాదు. కావున నిన్ను నిరంతరమును పూజించుటకు సిద్ధుఁడనై యున్నాను.

ప్రభ:- అర్చనము ముగిసిన పిమ్మట చేయదగిన 'విసర్జనము'' అనుకర్మ యిచట నిషేధింపఁబడినది.

మూ॥ వియోగ ఇన్దుధారిణా న చేహ విశ్వనాయికే।
మదమ్బ! సోఽత్ర రాజతే తటిల్ల తాశిఖాన్తరే॥ 21

నా తల్లీ! సహస్రార చంద్రధరుఁడును, హృదయాకాశగతుఁడును, అగు ఆ శివుఁడు – నాభికి మీదుగా (హృదయమునందు) ప్రకాశించుచున్న విద్యుల్లతా శిఖామధ్యమున జ్వలించుచుండును. (కావున) విశ్వేశ్వరీ! చంద్రశేఖరుఁడగు నా శివునితోడి వియోగము గూడ హృదయమునందుఁ గలుగదు.

ప్రభ:- సహస్రార కమలమును ధరించిన ఆత్మ – హృదయమునందే యున్నాడు. వానితోడి వియోగము కలుగునేరదని భావము.

విశే:- ''అధోనిష్ట్యా వితస్త్యాన్తే నాభ్యా ముపరితిష్ఠతి'' అని యారంభించి ''నీవారశూకవత్ తన్వీ పీతా భాస్వత్యణూపమాతస్యాః శిఖాయా మధ్యేపరమాత్మా వ్యవస్థితః'' అని (శ్రుతియందు) వినబడుచున్నదిగదా! సుషుమ్న యనునాడి హృదయమునుండి సహస్రారమునకు జ్యోతిస్సును దీసికొనిపోవుచుండునని యింతకు ముందుపన్యసింపఁబడినది. ఆ నాడియందున్న పురుషునకు హృదయముతోడి వియోగమెట్లు కలుగును? పూర్వ శ్లోకమున ''విసర్జనము విధింపఁబడదు'' అని నిరంతర పూజా హేతువు. చెప్పఁబడినది. ఈ శ్లోకము నందు– చంద్రశేఖరునితోడి (సహస్రారకమల ధరుఁడగు ఆత్మతోడి) వియోగము వలననే – పూజకు విచ్ఛేదము సంభవించును. కాని, అది యిచట సంభవింపదని చెప్పఁబడినది. కావున నిరంతరమగు పూజాసామగ్రి– నాకు సిద్ధించినదనునర్థము స్ఫురింపజేయఁబడినది.

మూ॥ ఇదం శరీర మేకకం విభావ్యనవ్యమన్దిరమ్।
విహారమత్రసేశ్వరా భవాని! కర్తుమర్హసి॥ 22

భవానీ! ఈ శరీరమును – ఏ కాకియగు (సజాతీయ సహాయశూన్యమగు) నూతన భవనముగా విభావించి, (అభిమానించి) ఈశ్వరునితోఁగూడి, యిందు విహారము నొనరింపుము.

ప్రభ:- ఈశ్వరికి ముఖ్యమగు స్థానము – సహస్రారము. ఈశ్వరునికి స్థానము హృదయము. కావుననే ''యీశ్వరునితోఁగూడి'' అని చెప్పఁబడినది.

మూ॥ జడేష్వివాల సేష్వివప్రయోజనం ననిద్రయా!
విహర్తుమేవయాచ్యసే హృదీశపద్మరాజ్ఞి! మే. 23

ఈశ్వర భవనాధిరాజ్ఞీ! అమ్మా! అజ్ఞులయందును, మందులయందును వలె, నిద్రించుట చేత – ప్రయోజనము లేదు. నా హృదమున విహరించుటకే (సంచరించుటకే) నిన్ను యాచించుచున్నాను.

ప్రభ:- జ్ఞానశక్తి లేని జడులయందును, క్రియాశక్తి లేని అలసులయందును గూడ దేవి - నిద్రించుచుండును. కావున వారియందు వలె నాయందు నిద్రపంకుము. నాయందు నిరంతరముగా సంచరింపుమని భావము.

మూ॥ అయంతవాగ్రిమః సుతః, శ్రితో మనుష్యవిగ్రహమ్।
తనూజవేశ్మ సౌష్ఠవం మృడాని పశ్యకీదృశమ్. 24

ఈ నీ పెద్దకొడుకు (గణపతి) మనుష్య విగ్రహమును (**మానవ దేహమును) ఆశ్రయించియున్నాఁడు. మృడానీ! నీ పుత్రుని గృహము యొక్క (శరీరము యొక్క) సౌష్ఠవము - ఎట్టిదో చూడుము.**

ప్రభ:- మానవ శరీరుఁడగు గణపతి యొక్క శరీరసుస్థితి - యెట్టిదో విలోకింపుమని భావము.

మూ॥ గణేశితుర్మహాకవే రసౌ ప్రమాణికావలీ
మనోమ్బుజే మహేశ్వరీ ప్రపూజనేషు శబ్ద్యతామ్. 25

మహాకవియగు గణేశ్వరకవి రచించిన యీ ప్రమాణికావళి (ప్రమాణికా వృత్త నిబ్ధములగు శ్లోకముల సంహతి) మహేశ్వరీ పూజలయందు పూజకుని మనఃకమలమున నుచ్చరింపఁబడుఁగాక!

ఇది - సవ్యాఖ్యమగు త్రింశస్తబకము

* * * *

ఓం నమోభగవతే శ్రీరమణాయ శ్రీ భారతీదేవ్యైనమః

ఉమా సహస్రము

(ఎనిమిదవ శతకము – తృతీయ స్తబకము)

ఏకత్రింశ స్తబకము

అవ:- ఈ ముప్పది యొకటవ స్తబకమున భగవతీనామ మహిమ – కీర్తింపఁబడుచున్నది.

మూ॥ దరస్మిత శ్రీకపటా సుపర్వ
స్రోతస్వినీ పర్వతజాస్యజాతా।
పఙ్కం మమక్షాలయతా దశేషం
సంసారమగ్నే హృదయే విలగ్నమ్॥ 1

పర్వతము నుండి యుదయించిన పార్వతి యొక్క ముఖము నుండి జనించిన దరహసిత ప్రభయను కపటము (మిష) గల దేవనది – (గంగ) జనన మరణాత్మకమగు సంసారమున మునిఁగిన నా హృదయమున విలగ్నమగు పంకమును (పాపమును, లేక బురదను) కడిగివేయునుగాత!

ప్రభ:- గంగానదియే కపటము చేత పార్వతీముఖమునందలి మందహాస ప్రభగా తోఁచుచున్నదని చెప్పఁబడినది. దేవనదియగు గంగ–పాపములను ప్రక్షాళితముల నొనర్చును. ''ఆ గంగయే – పార్వతీ ముఖమునందలి 'చిరునవ్వుతళుకు' అనుమిషతోనున్నది'' అని చెప్పఁబడినదిగదా! ఇచట– కపటశబ్ద ప్రయోగము చేత ఉపమేయమగు మందహాస ప్రభ – అసత్యముగాఁ జేయఁబడి, ఉపమానమగు గంగానది సత్యముగా ప్రదర్శింపఁబడినది. కనుక, ''ప్రకృతం యన్నిషిధ్యాన్యత్; సాధ్యతే సాత్వపహ్నుతిః'' ''ప్రస్తుత విషయమును నిషేధించి